క్లుప్తంగా

రవిరెడ్డి కుటుంబానికి వంశీకృష్ణ పరామర్శ



రవిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి తండ్రి గుడిమెట్ల సత్తిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సాగర్‌నగర్‌లోని వారి ఇంటికి శనివారం వచ్చి రవిరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

వర్సిటీని సందర్శించిన పూర్వ విద్యార్థులు



ప్రిన్సిపాల్ శశిభూషణ రావుతో పూర్వ విద్యార్థులు

ఏయూక్యాంపస్: పూర్వవిద్యార్థుల ప్రగతి విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలుస్తుందని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు అన్నారు. శనివారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో 1993–97 సంవత్సరంలో ఇంజినీరింగ్ చదువుకున్న విద్యార్థులు శనివారం ఏయూను సందర్శించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సును పూర్తిచేసిన వీరు కళాశాల ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగోదా జయంతి



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

ఎంవీపీకాలనీ: శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న అంజనేయస్వామి ఆలయంలో శ్రీగోదా (ఆండాళ్) జయంతిని వైభవంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఆలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత(108) కలశాభిషేకం, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కలశారాధన, లఘు పూర్ణాహుతి హోమం, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆచార్య ఓఆర్ రెడ్డి మృతికి సంతాపం



ఓఆర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యా విభాగం విశ్రాంత ఆచార్యులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సేవలందించిన ఆచార్య ఓ.ఆర్ రెడ్డి మృతికి ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం మద్దిలపాలెంలోని అంబేడ్కర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రంలో సంతాప సభ నిర్వహించారు. ఈ నెల 20న రాత్రి స్వగృహంలో ఆయన మృతి చెందిన సంగతి తెలిసిందే.



కర్రల కుర్చీలు, పక్కనే మంచె

కొండంత అందాలు కర్రలతో అపురూపాలు

ప్రకృతి ప్రదేశం కంబాలకొండ. హరితారణ్యాలు, పచ్చిక బయళ్లు, లోయలు, కొండలతో ప్రముఖ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతోంది. ఎకో టూరిజం ప్రదేశంగా పర్యాటకులకు అసలుసిసలైన అనుభూతిని అందిస్తోంది. వర్షాకాలంలో వచ్చే నీటిని ఒక ట్యాంక్‌లో స్టోర్ చేసి, అందులో బోటింగ్‌కు అవకాశం కల్పిస్తారు. బోటింగ్‌లో విహరిస్తూ అటవీ అందాలను వీక్షించవచ్చు. ఇప్పుడు మరింత హంగులతో ముస్తాబైంది. కర్రలతో కుర్చీలు, బెంచీలు, మంచ్‌లు, టేబుళ్లు ఏర్పాటు చేశారు.

• నరికొత్తగా కంబాలకొండ



పార్కు లోపల రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన కర్రల బెంచీ



క్యాంటిన్ సమీపంలో కర్రలతో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్



పార్కు లోపల నిర్మించిన ఊయల

ఆరిలోవ: కంబాలకొండలో గతంలో నిర్మించిన క్యాంటిన్ శిథిలమైంది. దాన్ని తొలగించి ఆరు నెలల క్రితం గడ్డి, వెదురు, కర్రలతో ఆధునికీకరించారు. దాని ముందు ఇటీవల కర్రలతో ఆర్చ్ నిర్మించారు. క్యాంటిన్ ఆవరణలో కర్రలతో తయారు చేసిన బెంచీలు, దాని చుట్టూ కుర్చీలు, దానికి సమీపంలో మంచ్ నిర్మించారు. దీంతో పాటు కంబాలకొండ కొలను ఒడ్డున మరొక మంచ్ నిర్మించారు. సందర్శకులు ఆ మంచ్‌లపైకి ఎక్కి కంబాలకొండ అందాలు వీక్షిస్తూ ఫొటోలు తీసుకునే ఏర్పాటు చేశారు. వాటితో పాటు ఈ పార్కు లోపల మంచ్ ఆకారంలో కర్రల షెడ్ నిర్మించారు. దానిలో నాలుగు వైపులా బలమైన తాళ్లతో కట్టిన ఊయలలు, వాటి మధ్యలో కర్రల టేబుల్ ఏర్పాటు చేశారు. ఆ టేబుల్‌పై ఏవైనా తినడానికి పెట్టుకొని ఊయలు ఊగుతూ ఎంజాయ్ చేయవచ్చు. దీని పక్కనే వెదురు, అకేషియా చెట్ల కర్రలతో రౌండ్ టేబుల్ నిర్మించారు. చుట్టూ గుండ్రంగా కర్రలతో బెంచీ నిర్మించి, దాని మధ్యలో కొంత ఎత్తులో ఒక టేబుల్ ఏర్పాటు చేశారు. దీనిపై 10 మందికి పైగా కూర్చొని టిఫిన్, భోజనం చేయవచ్చు. వీటితో పాటు కర్రలతో చేసిన బెంచీలు 20కి పైగా పార్కులో మధ్యమధ్యలోను, రోడ్డు పక్కన అమర్చారు. దీంతో ఈ పార్కులో కొత్తదనం సంతరించుకొంది.

పర్యావరణ హితంగా..

సిమెంట్, ఇనుము తదితర గృహ నిర్మాణ సామగ్రి లేకుండా పర్యావరణ హితం కోరి వీటిని ఏర్పాటు చేశారు. వీటికి రంగులు వేయడంతో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. కార్తీక మాసంలో నిత్యం ఇక్కడ వన భోజనాలతో కళకళలాడుతుంది. మిగిలిన రోజుల్లో సైతం పలు యూనియన్లు, సామాజిక వర్గాలు పిక్నిక్‌లు జరుపుకుంటుంటారు. పిక్నిక్‌ల కాలయంలో ఈ కర్రల కుర్చీలు, టేబుళ్లు కుటుంబాలతో వచ్చేవారికి అనుకూలంగా ఉంటాయని కంబాలకొండ ఇన్‌చార్జి శివప్రసాద్ తెలిపారు.

100 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన



100 మీటర్ల జాతీయ జెండాను పదర్శిస్తున్న సంతపాలెం పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం 100 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన చేపట్టారు. భారతీయ పతాక ఆమోద దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సిరికి శ్రీనివాసరావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని 1947 జూలై 22న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిందన్నారు. జాతీయ పతాకం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు పద్మావతి, వాణి, విజయభాను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనాన్ని సందర్శించిన విద్యార్థులు



ఉద్యానవనంలో బీవీకే కళాశాల విద్యార్థులు

ఏయూక్యాంపస్: జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎన్విరాన్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా ఉద్యానవనాన్ని సందర్శించారు. వీరితో పాటు కళాశాల ఆచార్యులు ఎన్. పద్మజ, డాక్టర్ ఎస్. శివ కుమార్, జి.వి గౌరవ్‌లు పాల్గొన్నారు. నగరంలోని బీవీకే డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు పార్క్‌ను సందర్శించారు. అధ్యాపకులు శివాజీ, మాధురిలతో కూడిన 20 మంది విద్యార్థులు పార్క్‌లో విశేషాలు తెలుసుకున్నారు. పార్క్‌లోని మొక్కల వివరాలు, ప్రత్యేకతలను నిర్వాహకులు డాక్టర్ మంథా రామమూర్తి వివరించారు.

జూలో పిల్లల పార్కులు



జూలో కనుజుల ఎన్‌క్లోజరు ఎదురుగా పిల్లల పార్కు



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు



పార్కులో మినీ కేఫ్‌టేరియా

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో పిల్లల కోసం ప్రత్యేకంగా రెండు చోట్ల పార్కులు సిద్ధం చేశారు. సీతాకోక చిలుకల పార్కు పక్కన ఒకటి, నెమళ్ల జోన్ సమీపం, కనుజుల ఎన్‌క్లోజర్ ఎదురుగా పిల్లలు ఆడుకునేందుకు వీలుగా జారుడు బల్లలు, ఊయలలు, రంగుల రాట్నాలు, తల్లిదండ్రులు సేదదీరడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. జూకు వచ్చే పిల్లలు వన్యప్రాణులను చూసి ఆనందించడంతో పాటు ఆటలాడుతూ సరదాగా గడపవచ్చు. అలాగే కనుజుల ఎన్‌క్లోజర్ ఎదురుగా పిల్లల పార్కులో మినీ కేఫ్‌టేరియా నిర్మించారు. దీన్ని జూ సిబ్బందే నిర్వహిస్తున్నారు. ఇక్కడ తినుబండారాలు, చాక్‌లెట్లు, సమోసాలు టీ, కాఫీ, కూల్‌డ్రింక్లను విక్రయిస్తున్నారు.

మణిపూర్ సంఘటన బాధాకరం



ఏయూ మెయిన్‌గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆచార్యులు, పరిశోధకులు

ఏయూక్యాంపస్: మానవత్వాన్ని మంటగలిపే విధంగా మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆచార్యులు, పరిశోధకులు ఖండించారు. శనివారం ఏయూ ఎస్సీ,ఎస్టీ, బీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏయూ అంబేడ్కర్ విగ్రహం నుంచి మెయిన్ గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళలపై లైంగికదాడికి పాల్పడి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో రెండు నెలలుగా జరుగుతున్న సంఘటనలు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలుస్తున్నాయన్నారు. బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య పి.అర్జున్, ఆచార్య జర్ర అప్పారావు, కుంజం నాగేశ్వర రావు, అరుణ్, సుబ్బారావు, రమేష్, బి.సుధాకర్, బోధనేతర సిబ్బంది సింహాద్రి, సత్యనారాయణ, మధుబాబు, పరిశోధకులు వెంకట్, రాజ్ కుమార్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

29న గర్భిణులకు ప్రత్యేక యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం, కృష్ణా హెల్త్ సెంటర్ సంయుక్తంగా ఈ నెల 29న గర్భిణులకు ప్రత్యేకంగా యోగా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. వర్క్‌షాపులో భాగంగా కృష్ణా హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ వి.రఘురామ కృష్ణంరాజు పాల్గొని సూచనలిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని.. రిజిస్ట్రేషన్ కోసం 91008 55823కు ఫోన్ చేయాలన్నారు.

విద్యార్థులకు సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

ఏయూక్యాంపస్: పాఠశాల విద్యాశాఖ అందించిన పాఠ్యపుస్తకాల పంపిణీని కలెక్టర్ ఎ.మల్లికార్జున శనివారం ప్రారంభించారు. శివాజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ టీచింగ్ పరిశీలించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఉత్సాహంగా సమాధానమిచ్చారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విధానంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల వేళల్లోనే కాకుండా ఖాళీ సమయాలలోను రోజూ అదనపు తరగతులు నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇతర పాఠశాలల్లో ఈ విధానం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, ఎంఈవో రామారావు, బాలామణి తదితరులు పాల్గొన్నారు.

నేవల్ డాక్‌యార్డ్‌లో ఏయూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు



డాక్‌యార్డ్‌ను సందర్శించిన ప్రిన్సిపాల్ శశిభూషణరావు తదితరులు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులకు భారత ప్రభుత్వ రక్షణ రంగ విభాగాల్లో ఒకటైన నేవల్ డాక్‌యార్డ్‌లో ఇంటర్న్‌షిప్‌లు లభించనున్నాయి. దీనిలో భాగంగా ఇటీవల ఏయూ నావికాదళంలో ప్రత్యేక ఎంఓయూను చేసుకుంది. ఏయూలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రక్షణ రంగ సంస్థలో ప్రత్యక్షంగా ఇంటర్న్‌షిప్‌లు పొందే అవకాశం ఉంది. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు నేతృత్వంలో ఆచార్యులు, 83 మంది విద్యార్థులతో కూడిన ప్రత్యేక బృందం నేవల్ డాక్‌యార్డ్‌ను సందర్శించింది. ముందుగా ఆచార్యులు, విద్యార్థులకు నావల్ డాక్‌యార్డ్ విధులు, పనితీరుపై అవగాహన కల్పించారు. అనంతరం నేవల్ డాక్‌యార్డ్ అధికారుల బృందం నేతృత్వంలో వివిధ విభాగాలను ఆచార్యులు, విద్యార్థులు ప్రత్యక్షంగా సందర్శించారు. కార్యక్రమంలో ఏయూ విభాగాధిపతులు అనుబంధ కళాశాలలైన అనిట్స్ కళాశాల, డాక్టర్ ఎల్.బుల్లయ్య కళాశాల, గాయిత్రి విద్యాపరిషత్, వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల, ఏయూ మహిళా కళాశాల, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్‌కు ఐకానిక్ అవార్డు



ఐకానిక్ లీడర్‌షిప్ అవార్డు అందుకొంటున్న విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్‌కు ఐకానిక్ లీడర్‌షిప్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డు–2023 లభించింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన న్యూ నార్మల్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మెట్–2023 కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ కార్యదర్శి ప్రొఫెసర్ ప్రత్యూషకుమార్, స్కిల్ ఎడ్యుకేషన్ సీబీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ బిశ్వాజిత్ సాహు, ఎన్‌సీఈఆర్‌టీ పీబీ డివిజన్ హెడ్ డాక్టర్ అనూప్‌కుమార్ తదితరుల సమక్షంలో ఆమె అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య విధానం అమలు చేస్తున్నందుకు తనకు ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.

25న రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సమావేశం

డాబాగార్డెన్స్ : ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, ఈపీడీసీఎల్ డిస్కం కార్యవర్గ సమావేశం ఈ నెల 25న విశాఖలో గల వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్టు జేఏసీ చైర్మన్ వీఎస్ఆర్‌కే గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశానికి ఏపీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కేంద్ర కార్యవర్గ ముఖ్య నాయకులు పాల్గొంటున్నట్టు తెలిపారు. డిస్కం పరిధిలో గల అన్ని కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, డిస్కం ముఖ్య ప్రతినిధులు, జేఏసీ కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని కోరారు.

ఏయూలో ఆర్పీ పట్నాయక్



సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సినీ సంగీత దర్శకుడు ఆర్.పి. పట్నాయక్ శనివారం సందర్శించారు. ఏయూలో తాను చదువుకున్న రోజులు, వర్సిటీ హాస్టల్స్‌లో గడిపిన సమయం, ఏయూలో నిర్వహించిన సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొన్న రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సినీ సంగీత రంగానికి నిపుణులను అందించే విధంగా వర్సిటీలో నిర్వహిస్తున్న సౌండ్ ఇంజినీరింగ్ కోర్సులు, నూతనంగా ఏర్పాటు చేసిన డీజీఎస్ స్టూడియో తదితర అంశాలను రిజిస్ట్రార్ ఆయనకు వివరించారు. ఏయూ సాధిస్తున్న ప్రగతిపై ఆర్.పి పట్నాయక్ అమితమైన ఆనందాన్ని వ్యక్తం చేశారు. వర్సిటీ తరఫున ఆర్.పి. పట్నాయక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఏ.డి. పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రిటైర్డ్ అధికారులకు మెడికల్ స్కీమ్‌పై ఆప్షన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పదవీ విరమణ అధికారుల మెడికల్ స్కీమ్‌పై యాజమాన్యం ఆప్షన్ ఇచ్చింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ నుంచి 2017 తర్వాత పదవీ విరమణ చేసిన అధికారులకు మొదట్లో గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీమ్ ఉండేది. ఆ స్కీమ్‌లో మార్పులు చేస్తూ పోస్టు రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ పేరిట ఉక్కు యాజమాన్యం కొత్త స్కీమ్ ప్రవేశపెట్టింది. కొత్త స్కీమ్ పదవీ విరమణ అధికారులకు నష్టదాయకమని, పాత విధానాన్ని కొనసాగించాలని వారు యాజమాన్యాన్ని అభ్యర్థించారు. యాజమాన్యం నుంచి స్పందన రాకపోవడంతో విశ్రాంత అధికారుల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. స్కీమ్ ఎంపికపై ఆప్షన్ ఇవ్వాలంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో యాజమాన్యం ఆప్షన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులపై ఉక్కు విశ్రాంత అధికారుల సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు హర్షం ప్రకటించారు.

27న విశాఖకు పురంధేశ్వరి



వివరాలను వెల్లడిస్తున్న సూర్యనారాయణరాజు

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఈ నెల 27న విశాఖ రానున్నట్లు ఆ పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ వి.సూర్యనారాయణరాజు తెలిపారు. శనివారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారిగా ఆమె విశాఖకు వస్తుండటంతో ఘనంగా స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. 27వ తేదీ విశాఖ విమానాశ్రయం నుంచి లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం మీడియా సమావేశంలో పురంధేశ్వరి పాల్గొంటారన్నారు. అదే రోజు వుడా చిల్డ్రన్ ఏరీనాలో జరిగే ఉత్తరాంధ్ర జోనల్ సమావేశంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ అభివృద్ధిపై దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఫీవర్ సర్వే



ఆరిలోవ జేఎన్‌ఎన్‌యూఆర్ కాలనీలో ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

ఆరిలోవ: ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జ్వరాల భారిన పడేవారిని గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఆరిలోవ ప్రాంతంలో రెండు రోజులు నుంచి ఫీవర్ సర్వే చేస్తున్నారు. జోన్–2 పరిధిలో జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళుతున్నారు. ఇళ్లలో జ్వరాలతో బాధపడుతున్నవారి వివరాలు సేకరిస్తున్నారు. వారిని ఆస్పత్రులకు తరలించి వైద్యం అందజేస్తున్నారు. పైనాపిల్‌కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ నుంచి టి.ఐ.సి పాయింట్ వరకు, ఇటు బాలాజీనగర్, తోటగరువు, గాంధీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, ఇందిరానగర్, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం వరకు ఫీవర్‌సర్వే జరుగుతోంది. దీంతో పాటు కొండవాలులో హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు ఈ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు.

ట్రైనీ ఐపీఎస్‌లకు అవగాహన



ట్రైనీ ఐపీఎస్‌లకు అవగాహన కల్పిస్తున్న సీపీ డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ

అల్లిపురం : మాడ్యుల్ ట్రైనింగ్‌లో భాగంగా 22 మంది ట్రైనీ ఐపీఎస్‌లు నగరానికి విచ్చేసారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నగర ప్రాముఖ్యతను, పోలీస్ విధులు తదితర అంశాలను వారికి విజువల్స్‌తో సహా వివరించారు. ట్రైనీ ఐపీఎస్‌ల అనుమానాలను కమిషనర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు, కోస్టల్ పోలీసు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ట్రైనింగ్ సిబ్బందికి కమిషనర్ మెమెంటోలు అందజేసి అభినందిచారు.